క్లుప్తంగా

ఆయకట్టుకు నీరిచ్చి రైతులను ఆదుకోండి



రెడ్డి శేఖర్‌రెడ్డికి సాగునీటి సమస్యలను విన్నవిస్తున్న ఎమ్మెల్యే సుధాకర్

కర్నూలు సిటీ: కోడుమూరు నియోజకవర్గ పరిధిలోని గ్రామాల్లో ఆయకట్టు కింద సాగు చేసిన పంటలకు నీరిచ్చి ఆదుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ జల వనరుల శాఖ కర్నూలు సర్కిల్ పర్యవేక్షక ఇంజినీర్ రెడ్డిశేఖరెడ్డిని కోరారు. ఈ మేరకు శనివారం నియోజకవర్గ రైతులతో జలమండలిలో ఆయనను కలిసి విన్నించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధాకర్ మాట్లాడుతూ.. గాజుల దిన్నె ప్రాజెక్టు, తుంగభద్ర దిగువ కాలువ, తుంగభద్ర నది తీరంలో ఉన్నటువంటి ఎత్తిపోతల పథకాల కింద సాగు చేసిన ఆయకట్టుకంతా నీరు ఇవ్వాలన్నారు. ఇంకా పంటలు చేతికి రాలేదని, ప్రస్తుతం నీరు తగినంత రాకపోవడంతో పంటలు దెబ్బతినే అవకాశం ఉందన్నారు. సి.బెళగల్ మండలం పోలకల్ గ్రామానికి చెందిన రైతులు ఎక్కువ శాతం క్రిష్ణదొడ్డి ఎత్తిపోతల పథకం సాగునీటిపై ఆధారపడి ఉన్నారని, వారికి నీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని కోరారు. స్పందించిన పర్యవేక్షక ఇంజినీర్ ఆయకట్టు రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సాగునీరు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే వెంట గూడూరు జెడ్పీటీసీ మౌలాలి, వ్యవసాయ సలహా మండలి సభ్యులు పోలకల్ ప్రభాకర్ రెడ్డి, పార్టీ నాయకులు నరసింహారెడ్డి, నాగేష్, పోలకల్ తదితరులు ఉన్నారు.

నేడు చనుగొండ్ల, గుడిపాడులో రథోత్సవం

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో శ్రీ నాగలింగేశ్వరస్వామి, గుడిపాడులో రామలింగేశ్వరస్వామి రథోత్సవ కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించనున్నారు. ఇందుకు అవసరమైన ఏర్పాట్లను ఆయా గ్రామాల ఆలయ కమిటీ పెద్దలు పూర్తి చేశారు. గుడిపాడులో రామలింగేశ్వరస్వామి దేవాలయానికి కొత్త రథం తయారు చేయించారు.


పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలు

కర్నూలు(అర్బన్): దేశంలోనే అత్యధిక ప్రజాభిమానం పొందిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని టీడీపీ అధినేత చంద్రబాబు, ఆయన తనయుడు లోకేష్ పదే పదే సైకో అంటే ప్రజలు హైదరాబాద్‌లోని ఇంటి దాకా తరిమి తరిమి కొడతారని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎం సుభాష్ చంద్రబోస్ హెచ్చరించారు. శనివారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ...పద్నాలుగు సంవత్సరాలుగా ముఖ్యమంత్రిగా పని చేశానని, నలభై సంవత్సరాల రాజకీయ అనుభవం ఉందని చెప్పుకునే చంద్రబాబును ప్రజలు అసహ్యించుకుంటున్నారన్నారు. తన కుమారుడు లోకేష్ పాదయాత్రకు జనం కరువైన ఫ్రస్టేషన్‌లో బాబు ఏమి మాట్లాడుతున్నాడో తెలియని స్థితిలో ఉన్నారన్నారు. చిత్తూరు జిల్లాలో పాదయాత్ర అట్టర్‌ఫ్లాప్ కావడంతో జీర్ణించుకోలేక తండ్రి, తనయులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌తో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలను ఇష్టానుసారం మాట్లాడుతున్నారని, పద్ధతి మార్చుకోకపోతే తీవ్ర పరిణామాలను ఎదుర్కోవాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు.

తిమ్మగురుడు ఉత్సవాలు ప్రారంభం

తుగ్గలి: మండల పరిధిలోని మీటే తండా సమీపంలోని బోడబండ పుణ్యక్షేత్రంలో వెలసిన తిమ్మ గురుడు, పక్కీరప్పస్వాముల తిరునాల ఉత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి భజనలతో రాత్రంతా జాగరణ చేశారు. తిరునాల సందర్భంగా అప్పా సోదరులు అన్నదానం చేశారు. ఆలయ ప్రాంగణంలో మిఠాయి, జాయింట్‌వీల్, బొమ్మలు, గాజుల అంగళ్లు, హోటళ్లు తదితర దుకాణాలు వెలిశాయి. స్వాముల ఉత్సవ విగ్రహాలను సాయంత్రం మేళ తాళాలతో ఉప్పర్లపల్లి నుంచి బోడబండకు చేర్చారు. ఆదివారం సాయంత్రం రథోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. ఆలయ ధర్మకర్తలు సుదర్శనరెడ్డి, అప్పా వేణు, నిర్వాహకులు ఉప్పర్లపల్లి సర్పంచ్ ప్రభాకరరెడ్డి, కృష్ణయ్యఆచారి పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి



సి.బెళగల్ గురుకుల విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న సర్పంచ్ పాండురంగన్న

సి.బెళగల్: విద్యార్థులు క్రీడల్లో రాణించి పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సి.బెళగల్ సర్పంచ్ పాండురంగన్న అన్నారు. శనివారం మండల కేంద్రం సి.బెళగల్‌లోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల పాఠశాల విద్యార్థులకు ప్రిన్సిపాల్ బలరాముడు, పీడీ రాఘవేంద్ర, ఉపాధ్యాయులు ఉమామహేశ్వరప్ప, జయాకర్‌రాజు, పీఈటీ రవితో కలిసి క్రీడా దుస్తులు అందజేశారు.



కాల్వబుగ్గలో స్వామి దర్శనం కోసం బారులు తీరిన భక్తజనం



బుగ్గరామేశ్వరస్వామికి అభిషేక పూజలు చేస్తున్న ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి



జగన్నాథగట్టులో భక్తులకు అన్నదానం చేస్తున్న కోడుమూరు ఎమ్మెల్యే సుధాకర్

శివోహం

- శైవాలయాలకు పోటెత్తిన భక్తజనం
- పరమశివుడికి ప్రత్యేక పూజలు
- మార్మోగిన శివనామస్మరణ
- ఆలయాల వద్ద అలరించిన ప్రత్యేక కార్యక్రమాలు



గూడూరు..అలంకరణలో నీలకంఠేశ్వర స్వామి

పాణ్యం: ఊరూరా శివనామస్మరణ మార్మోగింది. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని శనివారం భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయాలకు తరలి వచ్చారు. లింగాకారరూపుడైన పరమశివుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. పాణ్యం, కోడుమూరు నియోజకవర్గాల్లో శివరాత్రి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. కైలాసవాసుడికి భక్తులు అభిషేకాలు, అర్చనలు, రుద్రాభిషేక పూజలు చేపట్టారు. మండల కేంద్రం పాణ్యంలో వెలసిన శ్రీ పాణికేశ్వరస్వామి ఆలయంలో ఆలయ ఈఓ లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. శుభకృత్ నామ సంవత్సరం సందర్భంగా ఆలయ ప్రాంగణంలో పానకపందెరం నిర్వహించారు. అలాగే శ్రీ భవాని భృంగీశ్వరస్వామి ఆలయంలో శివరాత్రిని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కల్లూరు: పందిపాడు గ్రామం శివన్న తోటలో శుక్రవారం అర్ధరాత్రి నుంచే పూజలు ప్రారంభించారు. పూలతో వినాయక త్రిశూల, ఓంకారలింగా రూపాల్లో పరమశివుడిని అలంకరించి అఖండ దీపం పెట్టారు. కార్యక్రమంలో శివదీక్ష స్వాములు, ఆలయ పూజారి పూల హనుమన్న స్వామి, ఉమామహేశ్వర్‌రెడ్డి, శేఖర్ చౌదరి, గురునాథ్ పాల్గొన్నారు.

- కల్లూరులోని శ్రీఈశ్వర వీరభద్ర, భీమేశ్వర స్వామి దేవాలయాల్లో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి. రాత్రి వీరశైవ లింగాయతీ సమితి ఆధ్వర్యంలో శివ పంచాక్షరి భజన ఏర్పాటు చేశారు అనంతరం స్వామి వారి కల్యాణం జరిపించారు.
- స్థానిక ముజఫర్‌నగర్‌లో మహాశివరాత్రి సందర్భంగా కుర్ని(నేసే) కులానికి సంబంధించిన నగర దైవాచార సంఘం, మహిళ సంఘం, సంక్షేమ సంఘాల ఆధ్వర్యంలో శనివారం కలశ, దీపోత్స శోభాయాత్ర నిర్వహించారు.

ఓర్వకల్లు: కాల్వబుగ్గలో బుగ్గరామేశ్వరస్వామి, కన్నమడకల కాశీబుగ్గరామేశ్వరస్వామి, శకునాల గుమ్మితం మల్లికార్జునస్వామి, నన్నూరు నాగేశ్వర స్వామి, ఉప్పలపాడు బుగ్గరామేశ్వరస్వామి ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయా ఆలయాల ఈఓలు డీఆర్‌కేవీ ప్రసాద్, మద్దిలేటి, సీతారామిరెడ్డి ఆధ్వర్యాల్లో శివరాత్రి వేడుకలు జరిగాయి. కాల్వబుగ్గ దేవస్థానంలో పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి, సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ బుగ్గరామేశ్వరస్వామిని దర్శించుకుని అభిషేక అర్చనలు చేశారు. లోకాయుక్త జడ్జి లక్ష్మణరెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు రంగనాథ్‌గౌడు స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త మండలి చైర్మన్ గుర్రాల చెన్నారెడ్డి, ఈఓ డీఆర్‌కేవీ ప్రసాద్, సింగిల్ విండో చైర్మన్ నాగతిరుపాలు, ఆలయ ప్రధాన అర్చకుడు లక్ష్మీనారాయణశర్మ, ధర్మకర్త మండలి సభ్యులు పాల్గొన్నారు.

వైభవంగా శివపార్వతుల కల్యాణం

కోడుమూరు రూరల్: పట్టణంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వర ఆలయంలో భారతి సిమెంట్ జిల్లా డిస్ట్రిబ్యూటర్ ఎద్దుల మహేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో వేదపండితులు, కమిటీ సభ్యులు శివుడికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తర్వాత స్వామి వారి కల్యాణోత్సవం జరిపించారు. అలాగే నీలకంఠేశ్వర దేవాలయం, కోటవీధి భీమలింగేశ్వరస్వామి, గుంత శివాలయం, శ్రీకాళికా మాతా దేవాలయం, ఈశ్వరాలయాల్లో భక్తులు శివుడికి అభిషేకాలు, పూజలు నిర్వహించారు. మండలంలోని వర్కూరు శ్రీసిద్ధేశ్వరస్వామి ఆలయంలో ఆ గ్రామస్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సి.బెళగల్: స్థానిక బస్టాండ్ ఆవరణలోని శివాలయంలో శివపార్వతుల కల్యాణం నిర్వహించారు. సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు సీబీ గోవిందరెడ్డి, సీబీ వెంకటేశ్వరరెడ్డి సోదరుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం సాగింది. అనంతరం ఉత్సవ విగ్రహాలను ఎద్దుల బండిపై ఉంచి గ్రామంలో ఊరేగించారు. కార్యక్రమంలో సర్పంచ్ పాండురంగన్న, పురోహితుడు సుదర్శనచార్యులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. మండల కేంద్రం సి.బెళగల్ కోట వీధిలో శ్రీ రాజరాజేశ్వరి, స్థానిక కొండ మీద గట్టు మల్లప్ప, గ్రామ శివారులోని అన్నప్ప స్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే కొత్తకోట, కె.సింగవరం, సంగాల, గుండ్రేవుల, ముడుమాల, కొండాపురం, కంబదహాల్, బురాన్‌దొడ్డి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో రాత్రి జాగారణకు ఏర్పాట్లు చేశారు. పోలకల్ చెన్న సోమేశ్వర స్వామి గుడిలో భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

గూడూరు: స్థానిక నీలకంఠేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. స్వామిని భక్తులు దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అలాగే తిమ్మగురుడు స్వామి, శ్రీరాజరాజేశ్వరి ఆలయం, శ్రీఆంజనేయ స్వామి ఆలయాల వద్ద శివరాత్రి వేడుకలు ఘనంగా జరిగాయి.

రూపాల సంగమేశ్వరుడికి పూజలు

కర్నూలు (న్యూటౌన్): పార్వతీ పరమేశ్వరుల చల్లని దీవెనలు ప్రజలపై ఎల్లప్పుడూ ఉండాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ ఆకాంక్షించారు. కర్నూలు మండల దిన్నెదేవరపాడులోని జగన్నాథగట్టుపై శనివారం రాత్రి రూపాల సంగమేశ్వరస్వామి దేవాలయంలో మహాశివునికి ఆయన ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మాజీ మండల కన్వీనర్ హరినాథ్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మహబూబ్‌బాషా, సొసైటీ చైర్మన్ అమర్‌నాథ్‌రెడ్డి, గూడూరు పట్టణ కన్వీనర్ ఆబేలు, గూడూరు మున్సిపల్ వైస్ చైర్మన్ పీఎస్ అస్లాం, కౌన్సిలర్ మద్దిలేటి, మాజీ ఎంపీటీసీ సభ్యులు చిన్న లక్ష్మన్న, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

- కర్నూలు మండలం దిన్నెదేవరపాడులోని జగన్నాథగట్టుపై వెలసిన రూపాల సంగమేశ్వరస్వామి ఆలయం వద్ద విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో భక్తులకు చల్లని మజ్జిగ, శనగ గుగ్గిళ్లు, ప్రసాదం, మంచినీరు అందించారు. భక్తులకు సేవ చేయడంలోనే ఆత్మసంతృప్తి కలుగుతుందని ఈ సందర్భంగా బీజేపీ కోడుమూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ మీసాల ప్రేమ్ కుమార్ తెలిపారు.



భోగేశ్వరాలయం వద్ద ఉత్సవమూర్తులను ఊరేగిస్తున్న దృశ్యం

గడివేముల: ఎర్రమల కొండల్లో వెలసిన శ్రీ దుర్గా భోగేశ్వరాలయం శివనామ స్మరణతో మార్మోగింది. శివరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భోగేశ్వరక్షేత్రంలో అర్చకులు శ్యాంసుందర్‌శర్మ, గిరినాథశర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వేలాదిగా రావడంతో ఆలయ ప్రాంగణాలు కిక్కిరిశాయి. వారికి ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చైర్మన్ సునీల్‌కుమార్ రెడ్డి, ఈఓ చంద్రశేఖరరెడ్డి ఏర్పాట్లు చేశారు. పాణ్యం సీఐ వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో ఎస్‌ఐలు బీటీ వెంకటసుబ్బయ్య, సుధాకర్‌రెడ్డి బందోబస్తు నిర్వహించారు. కాశినాయన, వీరశైవులు, బ్రహ్మణ, ఆర్యవైశ్య సంఘాల ఆధ్వర్యాల్లో భక్తులకు అన్నదానం, కొరటమద్ది యూత్ ఆధ్వర్యంలో మజ్జిగ పంపిణీ చేశారు. రాత్రి భక్తుల కాలక్షేపం కోసం దేవనర్తకి నాటకం నిర్వహించారు.



కాల్వబుగ్గ క్షేత్రంలో భక్తుల సందడి



భోగేశ్వరుడిని దర్శించుకుంటున్న దృశ్యం



సి.బెళగల్‌లో స్వామి అమ్మవార్ల ఉత్సవ విగ్రహాల ఊరేగింపు



కల్లూరులో కలశ, దీపోత్స శోభాయాత్ర

ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేనేతలకు అవకాశం కల్పించండి

కర్నూలు(అర్బన్): స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో చేనేత వర్గాలకు అవకాశం కల్పించాలని తొగట వీర క్షత్రియ సేవా సంఘం జిల్లా అధ్యక్షులు గుంపు వెంకటేశ్వర్లు కోరారు. స్థానిక కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొగట వీర క్షత్రియ, పద్మశాలి, కుర్ని, నేసే, స్వకులసాలే, దేవాంగ, కర్నా, బత్తుల తదితర 18 కులాల చేనేతలందరు కలిసి రాష్ట్రంలో 25 శాతం జనాభాగా ఉన్నామన్నారు. చేనేతలందరు వైఎస్సార్‌సీపీకి ఎల్లప్పుడు అండగా ఉంటున్నారన్నారు. అందువల్ల చేనేతలను రాజకీయంగా అభివృద్ధి చేసే దిశగా మార్చి 9న జరగనున్న స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ వర్గానికి అవకాశం కల్పించాలని కోరారు. సమావేశంలో సంఘం ప్రధాన కార్యదర్శి వంకం వెంకటరమణ, కోశాధికారి మాదం గంగాధర్, వర్కింగ్ ప్రెసిడెంట్ మాదం రామచంద్రుడు, అసోసియేట్ అధ్యక్షులు ఇట్టి కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీలు ప్రారంభం

కృష్ణగిరి: మండల పరిధిలోని చుంచు ఎర్రగుడి గ్రామంలో మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలను శనివారం వైఎస్సార్‌సీపీ నాయకులు లక్ష్మీకాంతరెడ్డి, సంగాల గిడ్డయ్య తదితరులతో కలిసి ఎస్‌ఐ చంద్రశేఖర్‌రెడ్డి ప్రారంభించారు. పోటీల్లో 30 జట్లు పాల్గొన్నట్లు నిర్వాహకులు తెలిపారు. విజేతలకు వరుసగా రూ.20 వేలు, రూ.15 వేలు, రూ.10 వేలు, రూ.5 వేల నగదు బహుమతులు అందిస్తామన్నారు.

అప్పర్‌భద్ర ప్రాజెక్టుతో రైతాంగానికి తీవ్ర నష్టం

కౌతాళం: తుంగభద్ర డ్యాం పైభాగంలో కర్ణాటక ప్రభుత్వం నిర్మిస్తున్న అప్పర్‌భద్ర ప్రాజెక్టుతో రాయలసీమ రైతాంగానికి తీవ్ర నష్టం వాటిల్లుతుందని, ఈప్రాంతం ఏడారిగా మారుతుందని రాయలసీమ కో–ఆర్డినేషన్ కమిటీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీకాంత్‌రెడ్డి, ఎల్ఎల్‌సీ నీటి ఆయకట్టు దారుల సంఘం నాయకుడు సాయిబాబా, రాయలసీమ స్టీరింగ్ కమిటీ నాయకుడు ఉమ్మి సలీం అన్నారు. ఇప్పటికైనా అందరం మేల్కొని తుంగభద్ర నికర జలాల పరిరక్షణ కోసం ఉద్యమించాలని పిలుపు నిచ్చారు. శనివారం కౌతాళంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తుంగభద్ర రాయలసీమకు జీవధార అని ఆ నదిపైనే ఆధారపడి ఎల్ఎల్‌సీ, హెచ్ఎల్‌సీ, ఆర్‌డీఎస్, కేసీ కాలువలు ఉన్నాయన్నారు. అప్పర్‌భద్ర నిర్మాణం వల్ల ఈ కాలువలన్నీ ఎత్తిపోయే ప్రమాదం ఉందని చెప్పారు. సమావేశంలో రైతు సంఘం నాయకులు రాఘవేంద్ర, అనిల్, బసవరాజు, టిప్పు సుల్తాన్, షేక్షావలి, స్థానిక రైతులు పాల్గొన్నారు.

శరవేగంగా గోదాముల నిర్మాణం

- గత ఏడాది కోడుమూరు మండలంలోని రైతు రామగిడ్డయ్య నాలుగు ఎకరాల్లో ఉల్లిపంట సాగు చేశాడు.పంట చేతికొచ్చే సమయంలో మార్కెట్‌లో సరైన ధర లేదు. మంచి రేటు వచ్చిన తర్వాత విక్రయించుకుందామంటే నిల్వ చేసుకునే సదుపాయం లేదు. దీంతో తప్పని పరిస్థితిలో వ్యాపారులు అడిగిన ధరకే పంటను అమ్ముకోవాల్సి వచ్చింది.
- గూడూరు మండల పరిధిలోని చనుగొండ్ల గ్రామానికి చెందిన రైతు లక్ష్మీనారాయణ మూడెకరాల్లో మిరప పంట సాగుచేశాడు. గిట్టుబాటు ధరలేక కర్నూలు దగ్గర ఉన్న ప్రైవేట్ గోదాంలో పంట నిల్వ చేశాడు. రవాణా ఖర్చు, గోదాం బాడుగ లెక్కిస్తే వచ్చే లాభం వాటికి సరిపోతుందని సదరు రైతు వాపోయాడు.
- ఈ సమస్య వీరిద్దరిదే కాదు రైతులందరిదీ. కష్టపడి పండించిన పంటలను తక్కువ ధరకు విక్రయించి వారు నష్టపోకుండా నిల్వచేసుకునేందుకు ప్రభుత్వం గ్రామాల్లో గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది

- రైతుల శ్రేయస్సే లక్షంగా ప్రభుత్వం చర్యలు
- పంట నిల్వలకు గ్రామాల్లో గోదాముల ఏర్పాటు
- తొలివిడతగా జిల్లాకు 95 మంజూరు
- చకచకా జరుగుతున్న పనులు
- మార్చి నెలాఖరులోపు పూర్తి చేసి రైతులకు అంకితం ఇవ్వనున్న సర్కారు



కోడుమూరు మండలం క్రిష్ణాపురంలో నిర్మాణ దశలో ఉన్న గోదాం



అలూరులో పూర్తయిన గోదాం నిర్మాణం

కోడుమూరు : రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అన్నివిధాలుగా అండగా నిలబడుతోంది. విత్తనం మొదలు గిట్టుబాటు ధర కల్పన వరకు ప్రతి విషయంలో సాయపడుతోంది. తాజాగా రైతు తాను పండించిన పంటకు గిట్టుబాటు ధర వచ్చే వరకు సాధారణమైన అద్దె చెల్లించి నిల్వ చేసుకునేందుకు స్థానికంగా గోదాముల నిర్మాణానికి శ్రీకారం చుట్టింది. పలు గ్రామాల్లో ఈ పనులు చకచకా జరుగుతున్నాయి. గోదాముల నిర్మాణం పూర్తయిన వెంటనే ఆర్‌బీ కేంద్రాలకు వాటిని అప్పగిస్తారు. స్థానిక రైతులు గిట్టుబాటు ధర వచ్చేంత వరకు పంటను అందులో నిల్వ చేసుకుని అమ్ముకునేందుకు వెసులుబాటు కల్పిస్తారు. గ్రామాల్లోనే గోదాములు నిర్మిస్తుండడంతో తమకు రవాణా ఖర్చుల భారం తగ్గుతోందని రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పల్లెల్లో పంట ఉత్పత్తుల స్థాయిని బట్టి గోదాములను నిర్మిస్తున్నారు. కర్నూలు జిల్లాలో రూ.40 లక్షల వ్యయంతో 500 మెట్రిక్ టన్నుల గోదాములు 84, వెయ్యి మెట్రిక్ టన్నుల 11 గోదాములు రూ.75 లక్షల వ్యయంతో గ్రామాల్లో నిర్మిస్తున్నారు. అలూరు నియోజకవర్గంలో 9, పాణ్యం నియోజకవర్గంలో 6 గోదాముల నిర్మాణ పనులు పూర్తయ్యాయి. మొత్తం కర్నూలు జిల్లాకు 95 గోదాములు మంజూరయ్యాయి. కోడుమూరు నియోజవర్గంలో మంజూరైన 19 గోదాములు బేస్‌మెంట్ స్థాయిలో నిర్మాణాలు సాగుతున్నాయి. గోదాము నిర్మిస్తున్న ప్రతి చోట రైతులు పంట ఉత్పత్తులను గ్రేడింగ్ చేసుకోవడం కోసం డ్రైయింగ్ యార్డును సైతం ఏర్పాటు చేస్తున్నారు.

ధర వచ్చే వరకు పంట నిల్వ చేసుకోవచ్చు



పల్లెల్లో గోదాంలు నిర్మిస్తే మాలాంటి రైతులకు ఎంతో ఉపయోగం. రవాణా ఖర్చులు, ప్రైవేట్ గోదాంల అధిక బాడుగల భారం తగ్గుతోంది. గిట్టుబాట ధర వచ్చినప్పుడు అమ్ముకునే అవకాశం ఉంటుంది. ఇప్పటి వరకు పంటను ఇళ్లల్లో నిల్వ ఉంచుకునేందుకు స్థలాల్లేక, ప్రైవేట్ గోదాములకు బాడుగలు చెల్లించే స్తోమత లేక ఎక్కువ మంది పండిన పంటను అప్పటికప్పుడే అమ్ముకుంటున్నారు.

– గిడ్డయ్య, రైతు, కోడుమూరు

వ్యవసాయానికి ప్రభుత్వం పాధాన్యత



పంట పెట్టుబడి కోసం ప్రభుత్వం మూడు విడతలుగా ఇస్తున్న రూ.13,500 రైతుకు ఎంతో ఉపయోగపడుతుంది. దీంతో పాటు సబ్సిడీ విత్తనాలు అందజేయడం, ఆర్‌బీకేల ద్వారా రైతులకు సలహాలు, సూచనలు ఇవ్వడం జరుగుతుంది. ఇప్పుడు గోదాములను నిర్మిస్తుండటంతో రైతులకు మరింత మేలు జరుగుతుంది. పంటకు ధర ఉన్నప్పుడు విక్రయించుకునే వెసులుబాటు కలుగుతుంది.

– తేనేశ్వరరెడ్డి, సాగునీటి సంఘం అధ్యక్షుడు, కోడుమూరు

మార్చిలోపు గోదాముల నిర్మాణం పూర్తి



జిల్లాకు 95 గోదాంలు మంజూరయ్యాయి. నాబార్డు నిధులతో వాటిని నిర్మిస్తున్నాం. ప్రస్తుతం ఈ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అలూరు నియోజకవర్గంలో 9 గోదాంలు, పాణ్యం నియోజకవర్గంలో 6 గోదాముల నిర్మాణాలు పూర్తయ్యాయి. మిగిలిన చోట వివిధ స్థాయిల్లో ఉన్నాయి. వాటిని మార్చి నెలాఖరులోపు పూర్తి చేసి రైతులకు అందుబాటులోకి తెస్తాం.

–రఘురామిరెడ్డి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, మార్కెటింగ్‌శాఖ

నేడు భోగేశ్వరాలయానికి ఎమ్మెల్యే కాటసాని రాక

గడివేముల: మహా శివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం భోగేశ్వరాలయానికి ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి రానున్నట్లు ఆలయ చైర్మన్ సునీల్ కుమార్‌రెడ్డి తెలిపారు. ఎమ్మెల్యే స్వామిని దర్శించుకుని స్థానికంగా ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి బండలాగుడు పోటీలను ప్రారంభిస్తారని శనివారం ఓ ప్రకటనలో వెల్లడించారు.

హత్యాయత్నం కేసులో నిందితుల అరెస్ట్



నిందితులను అరెస్టు చూపుతున్న పోలీసులు

కర్నూలు: కల్లూరులోని శ్రీనివాస నగర్ వద్ద ఈ నెల 13వ తేదీ రాత్రి పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుమారుడు శివనరసింహారెడ్డి పీఏ కొమ్ము గిరిప్రసాద్‌పై జరిగిన హత్యాయత్నం కేసులో ముగ్గురు నిందితులను నాల్గవ పట్టణ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. శరీన్‌నగర్‌కు చెందిన ఎరుకలి నల్లబోతుల వంశీ అలియాస్ వంశీకృష్ణ, కల్లూరులోని సుంకులమ్మ గుడి దగ్గర ఉన్న శీలపోగు విశ్వనాథ్ అలియాస్ బన్నీ, సి.క్యాంప్‌లోని సత్యనారాయణ నగర్‌లో నివాసముంటున్న ఎరుకలి శివ అలియాస్ శివలు కలసి గిరిప్రసాద్‌పై శ్రీనివాసనగర్‌లోని ఓ ప్రైవేటు ఆసుపత్రి వద్ద కత్తితో దాడి చేసి పరారయ్యారు. సెక్షన్ 307 రెడ్‌విత్ 340 ఐపీసీ కింద కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఎస్‌ఐ రామయ్య ఆధ్వర్యంలో శనివారం ఉదయం కల్లూరు మండలం ఉల్చాల రోడ్డు సమీపంలోని ఎల్కూరు ఎస్టేట్ వద్ద ముద్దాయిలను దాడిచేసి పట్టుకున్నారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన ఏపీ21 సీఎఫ్ 2999 రాయల్ ఎన్‌ఫీల్డ్ మోటర్ సైకిల్, రక్తం మరకలు కలిగిన దుస్తులు, నేరానికి ఉపయోగించిన కత్తిని స్వాధీనం చేసుకున్నారు. ముద్దాయిలను కోర్టులో హాజరుపర్చగా న్యాయమూర్తి రిమాండ్‌కు ఆదేశించినట్లు ఎస్‌ఐ తెలిపారు.